క్లుప్తంగా

న్యాయం చేయాలని విజ్ఞప్తి



కదా కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

కొడంగల్ రూరల్: రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోతున్న వారికి పరిహారం అందించాలని స్థానిక ముస్లింలు అన్నారు. మంగళవారం పట్టణంలోని కదా కార్యాలయ సిబ్బందికి, సీఐ శ్రీధర్‌రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. పట్టణంలోని పురాతన మసీద్‌లు, శ్మశాన వాటికలు, చిన్న దర్గాలు రోడ్డు విస్తరణలో కోల్పోతున్నట్లు చెప్పారు. మసీద్‌లకు సంబంధించి దుకాణాల ద్వారా వచ్చే కిరాయిలతో మత పెద్దల జీతభత్యాలు చెల్లించేవారన్నారు. ప్రస్తుతం దుకాణాల సముదాయాలు కోల్పోతున్న తరుణంలో నష్టం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వమే తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం మతపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం

అనంతగిరి: బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నూతన కమిటీ కన్వీనర్‌గా శివరాజు, కోకన్వీనర్‌గా నాగరాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లో జిల్లా ముఖ్య ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు నిరంతరం పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో పలువురు సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

షాబాద్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే.. ఐకమత్యమే ఆయుధం, పోరాటమే మార్గమని భారతీయ కిసాన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చర్లగూడలో బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. భారతీయ కిసాన్ సంఘ్ గత 50 సంవత్సరాలుగా రైతులను పార్టీరహితంగా ఒకే వేదిక మీదికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే అతి ఎక్కువ సభ్యులు గల రైతు సంఘంగా నేడు భారతీయ కిసాన్ సంఘ్ అవతరించినట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులు ప్రధానంగా విద్యుత్, రెవెన్యూ, మార్కెటింగ్ సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని అనేక కరెంట్ సమస్యలను పరిష్కరించినట్లు స్పష్టం చేశారు. మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా పోరాడేందుకు సంఘం సమాయత్తమవుతున్నట్లు వెల్లడించారు. రానున్న వరి సీజన్ వరకు రైతులు, రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కలిపి సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు లేఖలు అందించినట్లు చెప్పారు. దీంతో వడ్ల అమ్మకాల్లో జరుగుతున్న మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందన్నారు.

బకాయిలు విడుదల చేయాలని భిక్షాటన

చేవెళ్ల: ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని, లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన షబానా బేగంకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. షబానా బేగం గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయాలని సూచించగా.. ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరు చేయించి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీరని యూరియా కష్టాలు!



తాండూరు టౌన్: మన గ్రోమోర్ సెంటర్ వద్ద క్యూలో నిలబడిన మహిళలు



తాండూరు టౌన్: పోలీసుల పహారాలో యూరియా బస్తాల పంపిణీ

- తెల్లవారుజామునే క్యూలో రైతులు
- పోలీసుల పహారా నడుమ పంపిణీ
- ఒక్కొక్కరికి ఒక్కటే నంచి
- సగం మందికిపైగా అందని యూరియా
- ప్రభుత్వ తీరుపై కర్షకుల అసహనం

తాండూరు టౌన్: అన్నదాతలకు యూరియా కష్టాలు తీరడం లేదు. మంగళవారం తెల్లవారుజామునే తాండూరు పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద బారులుదీరారు. ఇక్కడ కేవలం 400 బస్తాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలుసుకుని, ఒకరిపై ఒకరు ఎగబడ్డారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు రైతులను క్యూలో నిలబెట్టి ఒక్కొక్కరికి ఒక్కో బ్యాగు చొప్పున పంపిణీ చేయించారు. కానీ వెయ్యి మందికి పైగా కర్షకులు క్యూలో నిలబడటంతో అందరికీ యూరియా అందలేదు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతులకు సరిపోయే మేర యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో ఆటో డ్రైవర్‌కు డబ్బులు ఇస్తే.. యూరియా బస్తాలు నేరుగా ఇంటికి తెచ్చి ఇచ్చేవాడన్నారు. కానీ ఇప్పుడు పనులు మానుకుని రోజుల తరబడి పడిగాపులు కాసినా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని అసహనం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు రాజుగౌడ్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి అవసరం మేర యూరియా సరఫరా చేయకపోతే ఆందోళన తప్పదన్నారు.

బషీరాబాద్‌లో ఆందోళన

బషీరాబాద్: యూరియా కష్టాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. మంగళవారం బషీరాబాద్ సొసైటీకి యూరియా లోడ్‌తో వచ్చిన లారీ కొన్ని బస్తాలను మాత్రమే దించి, మిగిలిన బస్తాలను తీసుకెళ్తుండగా రైతులు అడ్డుకున్నారు. ఎస్‌ఐ నుమాన్ అలీ తన సిబ్బందితోవచ్చి రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, రైతుల మధ్య తోపులాట జరిగింది. అక్కడి నుంచి సొసైటీ ముందు ఆందోళనకు దిగిన రైతులను సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ వారిని సముదాయించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి మరో లారీ యూరియా పంపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

యాలాలలో గంటపాటు ధర్నా

యాలాల: డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా అందడం లేదంటూ రైతులు ధర్నా చేపట్టారు. మంగళవారం ఉదయం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో బైఠాయించారు. దీంతో తాండూరు– కొడంగల్ ప్రధాన మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, మాజీ ఎంపీటీసీ లక్ష్మప్ప తదితరులు రైతులకు మద్దతుగా ధర్నాలో కూర్చున్నారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నగేష్, ఎస్‌ఐ విఠల్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. సుమారు గంట పాటు చేపట్టిన ధర్నాతో యాలాల, బషీరాబాద్, కొడంగల్, తాండూరు మార్గాల్లో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

వరుసలో పాస్ బుక్‌లు

కుల్కచర్ల: యూరియా కోసం రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. చౌడాపూర్ ఆగ్రోస్ వద్ద ఉదయాన్నే క్యూలో నిలబడ్డారు. ఎంత తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను లైన్‌లో పెట్టి నిరీక్షించారు. అరకొరగా అందుతున్న యూరియాతో అవసరాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.



చౌడాపూర్‌లో యూరియా కోసం పట్టా పాసుపుస్తకం పెట్టి నిరీక్షిస్తున్న రైతులు

అందింది కొందరికే..



ఆగ్రోస్ వద్ద బారులు తీరిన రైతులు

దోమ: మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం దోమ ఆగ్రోస్ సెంటర్ వద్ద బారులు తీరారు. వందల సంఖ్యలో ఉన్న వారందరికీ యూరియా దొరక్కపోవడంతో ఉసూరుమంటూ తిరిగివెళ్లారు.



బషీరాబాద్: యూరియా లారీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



యాలాల: లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కొడంగల్ రూరల్: మేడ్చల్ బార్ అసోసియేషన్ మెంబర్, అడ్వకేట్ సురేశ్‌పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ కొడంగల్ బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం విధులను బహిష్కరించారు. అనంతరం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడుతున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును ప్రభుత్వం వెంటనే అమలు చేస్తూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బస్వరాజు, న్యాయవాదులు ఆనంద్, ప్రభాకర్, శ్రీనివాస్, కృష్ణయ్య, రమేష్, భానుప్రసాద్, రవీందర్‌నాయక్, మొహిద్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో మంగళవారం నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని కాలనీల్లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం వంటి కనీస సౌకర్యాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, సర్వర్‌పాషా, రాజేందర్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, తిరుపతిరెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, అర్జున్‌లక్ష్మణ్, యాదగిరియాదవ్, మసూద్‌ఖాన్, ముబారక్, రాములు, శ్రీనివాస్, నలమోని శ్రీధర్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

పగిలిన భగీరథ పైపులైన్



వెంకిర్యాల వాగులో పగిలిపోయిన పైపులైన్

కొందుర్గు: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి గత మూడు రోజులుగా మండలంలోని వెంకిర్యాల, లక్ష్మిదేవిపల్లి, ఆగిర్యాల, పాత ఆగిర్యాల గ్రామాలకు మిషన్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా పైపులైన్ లీకేజీతో భగీరథ నీళ్లు వృథాగా వాగులో కలిసిపోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకొని పైపులైన్ మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

దుద్యాల్: మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురిని ఎంపిక చేసినట్లు ఎంఈఓ విజయ రామారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. ఈ అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ఉత్తమ విద్య బోధన చేస్తున్న 14 మందిని ఎంపిక చేశామన్నారు. ఉత్తమ స్కూల్ అసిస్టెంట్లుగా అభయ్‌కుమార్(జెడ్పీహెచ్‌ఎస్ దుద్యాల్), మంజుల(జెడ్పీహెచ్‌ఎస్ కుదురుమల్ల), రత్నమాల(జెడ్పీహెచ్‌ఎస్ హకీంపేట్), సత్యమ్మ(కేజీబీవీ చెట్టుపల్లి తండా), హన్మంతు(జెడ్పీహెచ్‌ఎస్ చిలుముల్ మైల్వార్), శ్రీవాణి(జెడ్పీహెచ్‌ఎస్ చిలుముల్ మైల్వార్), అంజయ్య(ఎంపీపీఎస్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం దుద్యాల్), ఉత్తమ ఎస్జీటీలుగా పారిజాత(ఎంపీపీఎస్ దుద్యాల్), మల్లికార్జున్(ఎంపీపీఎస్ సంగాయిపల్లి), రాము(ఎంపీపీఎస్ దుద్యాల్), తేజశ్విని(ఎంపీపీఎస్ లగచర్ల), స్వామి(ఎంపీయూపీఎస్ గౌరారం), ఉమామహేశ్(ఎంపీపీఎస్ సత్తర్‌కుంట తండా), దిలీప్ కుమార్ (ఎంపీపీఎస్-చెట్టుపల్లి తండా) లకు చెందిన ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

తాగునీటి సమస్య తప్పింది



కొత్త మోటార్ బిగించడంతో నీరు పోస్తున్న బోరు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్య పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో రూ.2 లక్షలతో రెండు బోర్లను ఫ్లెస్సింగ్ చేయించడంతో పాటు కొత్త మోటార్లను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా తాగునీటి సమస్య ఉండేదని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో జాప్యం ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన రెండు బోర్లలో మోటార్లు బిగించామని, ఇక నీటి సమస్య ఉండదని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, శ్రీధర్‌గౌడ్, నర్సిములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రప్ప, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రోగులతో స్నేహంగా మెలగాలి



చన్గోముల్ ఆస్పత్రిలో మాట్లాడుతున్న డాక్టర్ ఇక్బాల్ ఫారుఖీ

పూడూరు: ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ మహ్మద్ ఇక్బాల్ ఫారుఖీ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చన్గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశవర్కర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రికి వచ్చే రోగులతో స్నేహంగా మెలగాలని తెలిపారు. ఆశవర్కర్లు గ్రామాల్లో ఇంటింటికి సర్వే నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం జరిగేలా ప్రోత్సహించాలన్నారు. వ్యాధులను దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈగలు, దోమలు దరిచేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీహెచ్‌ఎన్ షాహిదాబీ, ఫార్మసిస్టు రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ సాజిద్‌అలీ, సిబ్బంది దాసు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి సహకరించండి

టోల్‌ప్లాజా మేనేజర్‌కు తండావాసుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

షాద్‌నగర్: గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండావాసులు టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంప్యూటర్, ప్రింటర్ లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామంలో ముఖ్య కూడళ్లలో రాత్రి వేళల్లో చీకటిగా ఉంటుందని, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన వీధుల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, గ్రామాభివృద్ధికి టోల్‌ప్లాజా నిర్వాహకులు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుజ్జి, రాజునాయక్, నాయకులు తావ్యాసింగ్, శంకర్, రెడ్యా, సేవ్య, రవి, రమేశ్ తదితరులు ఉన్నారు.

రైతులే దేశానికి వెన్నెముక

భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి



పాడిరైతు దంపతులను సన్మానిస్తున్న భారతీయ కిసాన్ సంగ్ సభ్యులు

మొయినాబాద్‌రూరల్: రైతులు 24 గంటలు కష్టపడి చెమటోడ్చి పని చేస్తున్నప్పటికీ వారికి దేశంలో గుర్తింపు ఇవ్వడం లేదని భారతీయ కిసాన్ సంగ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సజ్జనపల్లిలో భారతీయ కిసాన్ సంఘ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జాతి గోవులను పోషిస్తున్న పాడిరైతు దంపతులను వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ కిసాన్ సంఘ్ విధి విధానాలను రైతులకు తెలియజేశారు. అధిక వర్షపాతంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పసల్‌బీమా అందించాలని, పంటలకు లాభసాటి ధరను చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు అనిమోని కృష్ణ, కనకమామిడి శంకర్, సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శివ, గోపాల్‌రావు, మోహన్‌రెడ్డి, అశోక్, రాంరెడ్డి, ఆంజనేయులు, కరుణాకర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, విఠలయ్య, గోపిగౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



గణేశ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు

మొయినాబాద్: భారతీయ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మండలంలోని రెడ్డిపల్లికి చెందిన గణేశ్‌ను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అభినందించారు. మంగళవారం రత్నంతో పాటు బీజేపీ నాయకులు గణేశ్ నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిందిస్థాయి నుంచి కష్టపడుతూ పార్టీ అనుబంధ సంఘాల బలోపేతానికి కృషి చేసిన గణేశ్‌కు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్నీ పదవులు అనుభవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, బీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ ఎల్గని వెంకటేశ్‌గౌడ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వీరేందర్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



దోమ: సన్మాన కార్యక్రమంలో జీహెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు



కుల్కచర్ల: సన్మాన కార్యక్రమం

బొంరాస్‌పేట: ఏడాది మండల స్థాయిలో ఎంపికైన 10మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం సన్మానం చేశారు. బొంరాస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ నుంచి భవాని, చౌదర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఆనంద్, రేగడిమైలారం జెడ్పీహెచ్‌ఎస్ శంకరయ్య, రేగడిమైలారం ప్రాథమిక పాఠశాల శ్రీదేవి, తుంకిమెట్ల ప్రాథమిక పాఠశాల రజిత, బొట్లవారితండా ప్రాథమిక పాఠశాల స్రవంతి, బురాన్‌పూర్ ప్రాథమిక పాఠశాల అలీమొద్దీన్, విజయలక్ష్మి, లింగన్‌పల్లి ప్రాథమిక పాఠశాల అమూల్య, బొట్లోనితండా ఆశ్రమ పాఠశాల సురేశ్‌లను మండల కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింలుగౌడ్, ఎంఈఓ హరిలాల్, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, మల్లేశం, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

జీహెచ్‌ఎంకు సత్కారం

దోమ: మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో నూతన జీహెచ్‌ఎంగా విధులు చేపట్టిన ఈ.విజయ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. గతంలో దోమ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన ఆయన 317 జీవోలో భాగంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీహెచ్‌ఎం ప్రమోషన్‌లో తిరిగి మండలంలోని బాలికల పాఠశాలలో విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రాజమణి, అంజనికుమార్, రామానుజమ్మ, శోభ, ఫర్జాన తదితరులు పాల్గొన్నారు.

ఘణపూర్‌లో..

కుల్కచర్ల: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి సముచిత గౌరవం ఉందని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఘణపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసే కృషి వెలకట్టలేదని చెప్పారు. గ్రామీణ ప్రాంత పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, హన్మంతు, వెంకటేష్, భాస్కర్, శేఖర్, శ్రీను, రాము, శివ, వివేకనంద, ఉపాధ్యాయులు విజయ్, నర్సింలు, కవిత, వెంకట్రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.